RNI. No. APTEL/2011/41055






# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక






సంపుటి : 13 సంచిక : 24 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం బుధవారం, 31 జూలై 2024 పేజీలు : 4 వెల : 2/-




## ఇచ్చిన మాట ప్రకారం...

# రుణమాఫీ నిధులు విడుదల

హైదరాబాద్ : తెలంగాణలో రైతులకు రేవంత్ సర్కార్ ఇవాళ మరో గుడ్‌న్యూస్ చెప్పబోతోంది. రుణమాఫీ రెండోవిడత జూలై 30న విడుదల చేసింది. రెండు విడత రుణ మాఫీలో భాగంగా లక్షన్నరలోపు ఉన్న వారికి రుణమాఫీ చేసింది. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ఈ రుణమాఫీని విడుదల చేశారు. జిల్లాల వారీగా రుణమాఫీ పొందిన వారి వివరాలు చూస్తే.. నల్లగొండ జిల్లాలో 51వేల 515 రైతుల ఖాతాల్లో 514 కోట్లు జమ చేసింది సర్కార్. నాగర్ కర్నూల్ జిల్లాలో 32వేల 406 రైతుల ఖాతాల్లో 312 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 27వేల 249 రైతులకు 286 కోట్లు విడుదల చేసింది. సిద్దిపేట జిల్లాలో 27వేల 875 రైతులకు 277 కోట్లు, సూర్యాపేట జిల్లాలో 26వేల 437రైతులకు 250 కోట్లు కేటాయించింది.

ఖమ్మం జిల్లాలో 33వేల 942రైతులకు 262 కోట్లు, రంగారెడ్డి జిల్లాలో 24వేల ఏడుమంది రైతులకు 229 కోట్లు, మెదక్ జిల్లాలో 22వేల 850మంది రైతులకు 216 విడుదల చేసింది తెలంగాణ సర్కార్. ఇక వికారాబాద్ జిల్లాలో 23వేల 912మంది రైతులకు 240 కోట్లు రిలీజ్ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 22వేల 253మంది రైతులకు 219 కోట్లు, నిజామాబాద్ జిల్లాలో 23వేల 769మంది రైతులకు 219 కోట్లు, కరీంనగర్ జిల్లాలో 21వేల 785మంది రైతులకు 207 కోట్లు విడుదల చేసింది సర్కార్.

కామారెడ్డి జిల్లాలో 24వేల 816మంది రైతులకు 211 కోట్లు, నిర్మల్ జిల్లాలో 18వేల 728మంది రైతులకు 196 కోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 18వేల 127మంది రైతులకు 177 కోట్లు విడుదల చేశారు. జగిత్యాల జిల్లాలో 17వేల 903మంది రైతులకు 169 కోట్లను రుణమాఫీ కింద రిలీజ్ చేసింది ప్రభుత్వం.



## త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

2014కు ముందు యూపీఏ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉందని చూపేందుకు బడ్జెట్‌లో భారీ ప్రకటనలు గుప్పించేదని, క్షేత్రస్థాయిలో వాటి అమలును పట్టించుకోలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ దిశగా ప్రస్థానం అనే అంశంపై కేంద్ర బడ్జెట్ 2024-25పై సీఐఐ నిర్వహించిన సదస్సులో ప్రధాని ప్రారంభోపన్యాసం చేశారు. పథకాలను పూర్తి చేసేందుకు గత ప్రభుత్వాలు శ్రద్ధ కనబరచలేదని దుయ్యబట్టారు. గత పదేండ్లుగా తాము ఆ పరిస్థితిని మార్చివేశామని ప్రధాని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే తాము రైల్వే బడ్జెట్‌ను 8 రెట్లు పెంచామని, హైవేల బడ్జెట్‌ను 8 రెట్లు, వ్యవసాయ బడ్జెట్‌ను 4 రెట్లు పెంచామని తెలిపారు. రక్షణ బడ్జెట్‌ను రెండింతలు పైగా పెంచామని చెప్పుకొచ్చారు. యూపీఏ హయాంలో లక్షలాది కోట్ల రూపాయల విలువైన అవినీతి కుంభకోణాలు వెలుగుచూసిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. తాము శ్వేతపత్రం రూపంలో దేశ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని దేశ ప్రజల ముందుంచామని చెప్పారు. మనం ఎక్కడ ఉన్నామనేదానిపై చర్చ జరగాలని చెప్పారు. భారత పరిశ్రమలను నూతన శిఖరాలకు చేర్చామని తెలిపారు. దేశ అభివృద్ధికి మూలధన వ్యయం కీలకమని 2004లో యూపీఏ తొలి బడ్జెట్‌లో మూలధన వ్యయం కేవలం రూ. 90,000 కోట్లు కాగా, ఇప్పుడు తమ ప్రభుత్వం రూ. 11 లక్షల కోట్లు పైగా మూలధన వ్యయం వెచ్చిస్తోందని ఈ నిధులతో దేశంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇవాళ మనం వికసిత్ భారత్ దిశగా పయనిస్తున్నామని, ఈ మార్పు కేవలం సెంటిమెంట్లతో రాలేదని, ఆత్మవిశ్వాసంతోనే ఇది సాధ్యమైందని అన్నారు. ప్రపంచంలో మనం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని, భారత్ త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆగస్టు 1న తెలంగాణ క్యాబినెట్ భేటి



హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ సమావేశాలు వాడివేగా కొనసాగుతున్నాయి. ఈ సమావేశాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..ఆగస్టు 1న మధ్యాహ్నం 2.30 గంటలకు అసెంబ్లీలో తెలంగాణ క్యాబినెట్ సమావేశం జరుగుతుందని తెలిపారు. గతంలో ఆగస్టు 01న సాయంత్రం 4.30 గంటలకు ఉంటుందని నిర్ణయించాం. కానీ మధ్యాహ్నం 2.30 గంటలకే కేబినెట్ సమావేశం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే పలు విషయాలపై చర్చించారు. కాగా, తెలంగాణకు జరిగిన అన్యాయంపై, పాలమూరు వలసలపై ఆనాడు నేను అసెంబ్లీలో మాట్లాడాను. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పై నేను అసెంబ్లీలో ఎంత మాట్లాడానో.. కేసీఆర్ పార్లమెంట్ లో ఎంత మాట్లాడారో రికార్డులు తీయండి. ఇతరుల త్యాగాల పునాదులపై అధికారంలోకి వచ్చింది వీళ్లు.. జర్నలిస్ట్ పై కేసు పెట్టామని చెబుతున్న వీళ్లు వారి పాలనలో ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి ఆమె చానల్ ను గుంజుకున్నారు. ఇప్పుడు ఆ జర్నలిస్ట్ పై మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఆడబిడ్డలను జైల్లో పెట్టినందుకే ఇప్పుడు ఆ పాపం అనుభవిస్తున్నారు. ఆనాడు నన్ను జైల్లో పెట్టినా నేను భయపడలేదు. అబద్దాలు చెబితే నమ్మడానికి ప్రజలు అమాయకులు కాదు. విద్యుత్ పై మీరు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఆగస్టు 1, 2న బీఆరెస్ పదేళ్ల పాలనపై చర్చకు సిద్దం. మీరెంత అబద్ధాలు చెబితే నేను అంత నిజాలు చెబుతానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే..ఆగస్ట్ 2న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి. అయితే, అసెంబ్లీ సమావేశాల ముగింపునకు ఒక్క రోజు ముందే తెలంగాణ క్యాబినెట్ భేటీ కానుండటం ఆసక్తిగా మారింది.

ఈ భేటీకి సంబంధించిన అజెండా ఏంటన్నది తెలియనప్పటికీ.. జాబ్ క్యాలెండర్, రైతు భరోసా గైడ్ లైన్స్‌కు సంబంధించిన టాపిక్స్‌పై కేబినెట్ డిస్కస్ చేయనున్నట్లు సమాచారం.



## మేం తప్పకుండా సహకరిస్తాం...

### వచ్చే సెషన్ 20 రోజులు నిర్వహించాలి : కేటీఆర్

హైదరాబాద్ : సోమవారం ఉదయం 10 గంటలకు శాసన సభ ప్రారంభం కాగా, మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు సభ కొనసాగిన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కీలక సూచన చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ అనుమతితో కేటీఆర్ ఈ సూచన చేశారు. ఒకే రోజు 19 పద్దులపై చర్చ జరిపి అప్రూవ్ చేసుకోవాలనే ఉద్దేశంతో మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు సభను నడిపారు. సుదీర్ఘ ప్రసంగాలు చేయొద్దన్న శాసనసభ వ్యవహారాల మంత్రి ప్రతిపాదనను అంగీకరిస్తున్నాము. కానీ ఈ సభలో 57 మంది కొత్త సభ్యులు ఉన్నారు.. వారందరూ మాట్లాడాలని అను కుంటున్నారు. ఇలా రోజుకు 19 పద్దులపై చర్చ పెట్టకుండా.. రోజుకు 2 లేదా 3 పద్దులపైన చర్చ పెట్టాలని కోరుతున్నాం. రేపు ద్ర వ్య విని మయ బిల్లు పెడుతున్నారు. ఈ సమావేశాలు అయిపోయాయి. కానీ వచ్చే అసెంబ్లీ, బడ్జెట్ సమావేశాల్లో రోజుకు 19 పద్దులు పెట్ట కుండా, 2 లేదా 3 పద్దులపై సావధానంగా చర్చ జరిగేలా చర్యలు తీసుకోవాలి. మంత్రులు కూడా సుదీర్ఘ వివరణ ఇచ్చే అవకాశం ఉంటుంది. వచ్చే సెషన్‌ను అవసరమైతే 20 రోజులు పెట్టాలి. మా వైపు నుంచి తప్పకుండా కో ఆపరేషన్ చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# 'కొత్తబాస్'పై కసరత్తు!

## దాదాపు ఖరారు ! - ఆగష్టు 15న ప్రకటన!!




హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిపై దాదాపుగా స్పష్టత వచ్చింది. సామాజిక సమీకరణాల ఆధారంగా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. 15 రోజుల్లో కొత్త పీసీసీ చీఫ్ అభ్యర్థి పేరును ప్రకటించే అవకాశం ఉంది. టీ పీసీసీ పోస్ట్ కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన కీలక నేతలు జోరుగా లాబీయింగ్ చేశారు. కొద్దిరోజులు ఢిల్లీలోనే మకాం వేశారు. చివరికి హైకమాండ్ ఎస్టీ నేత వైపు మొగ్గుచూపారని విశ్వసనీయ సమాచారం. అభ్యర్థి ఎవరనే అంశం కొద్దిరోజుల్లో తేలనుంది.

**అంతా ఓకే.. కానీ :** పీసీసీ చీఫ్ ఎంపిక కోసం ఇటీవల పలుమార్లు సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. హైకమాండ్ పెద్దలతో మాట్లాడారు. మంత్రులు, కీలక నేతల సూచనలను కూడా అధిష్ఠానం పరిగణలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ఎస్టీ (లంబాడ) సామాజిక వర్గానికి చెందిన నేతకు పదవి ఇచ్చేందుకు సుముఖంగా ఉంది. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అతని అభ్యర్థిత్వంపై సీఎం రేవంత్ సహా మంత్రులు, కీలక నేతలు సానుకూలంగా ఉన్నారని సమాచారం. అందరి అభిప్రాయం తీసుకునే బలరాం నాయక్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారని, ప్రకటించడమే మిగిలి ఉందని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది.

**ఆలస్యం ఎందుకంటే..? :** పీసీసీ చీఫ్ అభ్యర్థిత్వం కన్ఫామ్ అయ్యింది. సీఎం రేవంత్ రెడ్డి వచ్చేనెల 2వ తేదీ నుంచి విదేశాలకు వెళుతున్నారు. ఫారిన్ టూర్ ముగించుకొని 14వ తేదీన స్వదేశం తిరిగొస్తారు. ఆయన రాష్ట్రానికి వచ్చిన తర్వాత పీసీసీ చీఫ్‌ను ప్రకటిస్తారు. సీఎం రేవంత్ రాష్ట్రంలో ఉండకపోవడంతో పీసీసీ చీఫ్ అభ్యర్థి ప్రకటన వాయిదా పడింది. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిపై స్పష్టత వచ్చిందని కాంగ్రెస్ నేతల్లో చర్చ జరుగుతోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతకు కార్యనిర్వహక అధ్యక్ష పదవి ఇచ్చే అవకాశం ఉంది.

**రెండు పదవులు :** గత 8 నెలల నుంచి రేవంత్ రెడ్డి సీఎం పదవితోపాటు పీసీసీ చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. రేవంత్ పీసీసీ చీఫ్‌గా అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లి, పార్టీని విజయతీరాలకు చేర్చారు.

రేవంత్‌ను సీఎం పదవి వరించింది. ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పటికీ పీసీసీ చీఫ్‌ను హైకమాండ్ ఎంపిక చేయలేదు. వివిధ కారణాలతో ఎంపిక ప్రక్రియ వాయిదా పడింది. వెంటనే లోక్ సభ ఎన్నికలు, ఇతర అంశాలతో అగ్ర నేతలు తీరిక లేకుండా గడిపారు. దాంతో పీసీసీ చీఫ్ అభ్యర్థి అంశం పెండింగ్‌లో ఉంది.

ఇన్నాళ్లకు అభ్యర్థిని ఖరారు చేశారు. కొద్దిరోజుల్లో పేరు ప్రకటిస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

**విధేయతకే పట్టం..పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో ట్విస్ట్..!** తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిపై స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. అనేక సంప్రదింపులు.. సమాలోచనల తర్వాత తెలంగాణ పీసీసీ బాస్ ఎవరనే దానిపై అధిష్టానం తుది నిర్ణయానికి వచ్చినట్లుగా సమాచారం. సామాజిక సమీకరణాలు.. విధేయత ఆధారంగా కొత్త అధ్యక్షుడి నియామకం పూర్తి చేసినట్లుగా తెలుస్తోంది. పీసీసీ చీఫ్ పదవి కోసం కాంగ్రెస్ సీనియర్ నేతలు గత కొద్ది రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి తీవ్రస్థాయిలో లాబియింగ్ కొనసాగించారు. బీసీ సామాజిక వర్గం నుంచి మహేష్ కుమార్ గౌడ్, మధు యాష్కీలు పోటీ పడగా.. ఎస్సీ సామాజిక వర్గం నుంచి సంపత్ కుమార్..ఎస్టీ సామాజిక వర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్ పేర్లు ప్రధానంగా వినిపించాయి. ప్రస్తుతం వర్కింగ్ ప్రెసిడెంట్ గా కొనసాగుతోన్న మహేష్ కుమార్ గౌడ్ పేరు ఖరారు అయిందని ఆ మధ్య జోరుగా ప్రచారం జరిగింది. మహేష్ కుమార్ గౌడ్ అభ్యర్థిత్వాన్ని రేవంత్ సైతం బలపర్చారని దాంతో కొద్ది రోజుల్లోనే అధిష్టానం అధికారిక ప్రకటన చేయనుందని వార్తలు వచ్చాయి. కానీ , అధిష్టానం మాత్రం పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో ఊహించని విధంగా ట్విస్ట్ ఇచ్చింది.

ఎంపీ బలరాం నాయక్ వైపు హైకమాండ్ మొగ్గు చూపిందని తెలుస్తోంది. గతంలో కేంద్రమంత్రిగా కూడా పని చేసిన బలరాం నాయక్ కు కాంగ్రెస్ పెద్దలతో మంచి సత్సంబంధాలు ఉండటంతోపాటు పార్టీకి విధేయుడిగా ఆయనకు పేరుంది. ఆయన విధేయతను పరిగణనలోకి తీసుకొని దాదాపుగా బలరాం నాయక్ పేరును ఖరారు చేశారని.. రేవంత్ విదేశీ పర్యటన ముగించుకొని వచ్చాక ఈ నెల 15న అధికారిక ప్రకటన ఉంటుందని అంటున్నారు.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

### ప్రశాంత్ కిశోర్ రాజకీయ పార్టీ రెడీ!

ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే రాజకీయ వ్యూహకర్త అవతార్ నుంచి పూర్తి స్థాయి రాజకీయ నాయకుడి అవతారానికి సిద్ధమైపోయారు. ఆయన కొత్త పార్టీ స్థాపనకు రెడీ అయిపోయారు. మరో రెండు నెలలలో ప్రశాంత్ కిశోర్ కొత్త పార్టీ స్థాపన జరగనుంది. ఈ విషయాన్ని ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. తాను ప్రస్తుతం నడుపుతున్న జన్ సురాజ్ అనే సామాజిక సంస్థ పేరునే కొత్త పార్టీకి మారుస్తూ రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుడుతున్నట్లుగా వెల్లడించారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి నాడు జన్ సురాజ్ ని రాజకీయ పార్టీగా మారుస్తూ కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లుగా తెలిపారు. ఇదిలా ఉంటే రాజకీయ వ్యూహకర్తగా ఐ పాక్ వ్యవస్థాపకుడిగా ప్రశాంత్ కిశోర్ దేశంలో అందరికీ తెలిసిన వారుగా ఉన్నారు. ఇక ఏపీలో 2019 ఎన్నికల్లో వైసీపీని అధికారంలోకి తీసుకుని రావడంలో తనదైన వ్యూహాలను అందించానని పీకే చెప్పుకుంటారు. అలా ఆయన ఏపీకి పరిచయం. ఇటీవల ఎన్నికల్లో పీకే టీడీపీకి కూడా పరోక్షంగా రాజకీయ సలహాలు ఇచ్చారని వ్యూహాలలో సాయం చేశారని ప్రచారం సాగింది. ఇదిలా ఉంటే బీహార్ లో 2025 నవంబర్ లో శాసనసభకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఆ ఎన్నికలో అధికార జేడీయూ బీజేపీ కూటమిని ఢీ కొట్టడానికి పీకే జన్ సురాజ్ ని సిద్ధం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. తాము నితీష్ ని గద్దె నుంచి దించుతామని ఆయన చెబుతున్నారు. మరి విపక్ష కూటమిగా ఇండియా కూటమి ఉంది. పీకే సొంతంగా పోటీ చేస్తారా లేక కూటమితో చేతులు కలుపుతారా అన్నది చూడాలి ఏది ఏమైనా పీకే రాజకీయ అవతారం మాత్రం ఆసక్తిని రేపుతోంది. వ్యూహాలు రూపొందించడం వేరు, రాజకీయాలను ప్రత్యక్షంగా చేయడం వేరు. జనాలలో ఇమేజ్ ఉండాలి. వారి విశ్వాసం చూరగొనాలి. ఆ విధంగా చూస్తే ఈ బిహారీ బాబు తన సొంత రాష్ట్రం ప్రజల నమ్మకాన్ని ఏ మేరకు పొందుతారు అన్నది రానున్న కాలమే నిర్ణయించబోతుంది అని అంటున్నారు.

# ఆయకట్టులో జలపట్టు..!



నల్గొండ : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు సజీవం కానుంది. ప్రస్తుతం కృష్ణా బేసిన్‌లో పరిస్థితులు చూస్తే నాలుగైదు రోజుల్లో భారీ వరద సాగర్‌ను తాకనుంది. ఎగువ కృష్ణా పరివాహక ప్రాంతాల్లో పడుతున్న భారీ వర్షాలతో కర్ణాటక ప్రాజెక్టులు ఇప్పటికే నిండుకుండలుగా మారగా.. పైనుంచి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయానికి 3.60 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నీటిమట్టం 129.0 టీఎంసీలకు (పూర్తి సామర్థ్యం 215.81 టీఎంసీలు) చేరింది. వరద ఇలాగే కొనసాగే అవకాశం ఉండటంతో.. మరో మూడు రోజుల్లో శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకునే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కృష్ణా నది జన్మస్థానమైన సహ్యాద్రి పర్వతాలతో పాటూ మహారాష్ట్రలోని కొల్హాపూర్, సతారా, సాంగ్లి తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతున్న దృష్ట్యా ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి వస్తున్న వరద వారం పాటూ కొనసాగే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో శ్రీశైలం నుంచి నేరుగా వరద జలాలు సాగర్ ప్రాజెక్టును చేరనున్నాయి. సాగర్ ప్రాజెక్టు వద్ద 36 వేలకు పైగా క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. ఒకట్రెండు రోజుల్లో శ్రీశైలం పవర్‌హౌస్‌ల నుంచి సైతం విద్యుతుత్పత్తి ద్వారా నీటిని దిగువకు వదలనున్నారు. కర్ణాటకలో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కేంద్ర జలవనరుల శాఖ ఆదేశించిన నేపథ్యంలో అత్యవసరం అయితే ఒకట్రెండు రోజుల్లోనే శ్రీశైలం క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏ రకంగా చూసినా ఆగస్టు ఒకటో తేదీ కంటే ముందుగానే కృష్ణమ్మ వరద రెండు రాష్ట్రాల వరప్రదాయినిని తాకే అవకాశం ఉంది.

**ఐదు లక్షల ఎకరాల్లో సాగుకు అనుకూలం**

గతేడాది సాగర్ ప్రాజెక్టులోకి ఆశించినంత మేర వరద చేరకపోవడంతో యాసంగిలో సుమారు 3.5 లక్షల ఎకరాలను రైతులు బీళ్లుగానే వదిలేశారు. ఈ ఏడాది జులై ఆఖరులోనే శ్రీశైలం ప్రాజెక్టు నిండుతుండటం, ఎగువ ఆశాజనక పరిస్థితులు ఉండటంతో ఎడమ కాల్వ కింద నల్గొండ, సూర్యాపేట జిల్లాలోని 3.5 లక్షల ఎకరాలు, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) కాల్వ పరిధిలో 2.5 లక్షల ఎకరాల ఆయకట్టులో పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే ఈ రెండు కాల్వల కింద బోరుబావులు ఉన్న రైతులు సుమారు లక్ష ఎకరాల్లో వరిని సాగు చేశారు. తాజా పరిణామాలతో మరో ఐదు లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు కానుంది. దీంతో వ్యవసాయ అధికారులు సైతం అందుకు కావాల్సిన ఎరువుల కొరత లేకుండా నిల్వలపై దృష్టి పెట్టారు. రెండేళ్ల క్రితం ఆగస్టు ఒకటో తేదీన సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోగా క్రస్ట్‌గేట్ల నుంచి నీటిని దిగువన ఉన్న టెయిల్‌పాండ్‌కు వదిలారు. తిరిగి ఇప్పుడు సాగర్ పూర్తిస్థాయి నీటామట్టానికి చేరే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

# పల్లె పోరులో కదలిక



వికారాబాద్: పంచాయతీ ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడంతో జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ సందడి నెలకొంది. బీసీ గణన పూర్తయ్యాకే ఎన్నికలు నిర్వహిస్తారన్న కోణంలో ఆలోచించి మరో ఆరు మాసాల పాటు జరగవనే అభిప్రాయంతో ఉన్న ఆశావహుల్లో ప్రభుత్వ నిర్ణయం కదలిక తీసుకువచ్చింది. దీంతో పోటీ చేయడానికి అనుగుణంగా తమ మద్దతుదారులతో సమాలోచనలకు తెర తీయడంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

**కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలన**

జిల్లాలోని 20 మండలాల్లో 566 గ్రామ పంచాయతీలకు 2019 జనవరిలో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించారు. గత ఫిబ్రవరి 1 నుంచి పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ విధానం ఉండేలా గత ఎన్నికల్లోనే నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాత విధానాన్నే కొనసాగిస్తారా? ఏవైనా మార్పులు చేస్తారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. బీసీ ఓటర్ల సంఖ్య పెరగడంతో రిజర్వేషన్లలో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లు పంచాయతీరాజ్ శాఖ అధికారులు భావిస్తున్నారు. అయితే బీసీ గణన ప్రకారం రిజర్వేషన్లను పెంచే అవకాశం లేకపోవడంతో పాత విధానాన్నే కొనసాగించే వీలుందని ప్రజా ప్రతినిధులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 18 జడ్పీటీసీ, 221 ఎంపీటీసీ స్థానాలున్నాయి. జులై 4న పదవీకాలం ముగిసింది. వీటికి కూడా సర్పంచులకు మాదిరిగానే రెండు పర్యాయాలు రిజర్వేషన్ అమల్లో ఉంది. రెండు మాసాల వ్యవధిలో సర్పంచి, ప్రాదేశిక ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆశావహులు ఇప్పటికే ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు ప్రారంభించారు.

**మండలాల వారీగా పంచాయతీలు**

వికారాబాద్- 21, మర్పల్లి- 27, బంట్వారం- 11, కోట్‌పల్లి- 18, మోమిన్‌పేట- 28, ధారూర్- 32, నవాబుపేట- 32, తాండూర్- 33, పెద్దేముల్- 37, యాలాల్- 37, బషీరాబాద్- 36, పరిగి- 37, పూడూర్- 31, దోమ- 36, కుల్కచర్ల- 44, కొడంగల్- 26, బొంరాస్‌పేట- 47, దౌల్తాబాద్- 33.

**వాస్తవానికి గతంలోనే ఏర్పాట్లు**

గతేడాది డిసెంబరులోనే సర్పంచి ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

200 మంది ఓటర్లకు ప్రిసైడింగ్ అధికారితో పాటు పోలింగ్ అధికారి ఉంటారు.

201- 400 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401- 650 వరకు ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు.

650 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

మొత్తం జిల్లా జనాభా: 12.50 లక్షలు
మండలాలు: 20
పంచాయతీలు: 566

నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి

గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్, లెక్కింపు కేంద్రాలు, ఎన్నికల అధికారుల నియామకం తదితర ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నాం.

# చీకటి వాకిట్లో పేదల గూళ్లు



హైదరాబాద్ : పేదలకు అందజేసిన రెండు పడక గదుల ఇళ్లు చీకట్లో మగ్గుతున్నాయి. లబ్ధిదారులకు పంపిణీ చేసి ఏడు నెలలవుతున్నా.. విద్యుత్తు పనులు పూర్తవలేదు. కొన్నిచోట్ల పనులు ప్రారంభమే కాలేదు. మరోవైపు లక్ష ఇళ్లలో 30శాతం ఇంకా పూర్తి కాలేదు. నిధుల సమస్యతో రెండేళ్లుగా జీహెచ్‌ఎంసీ గుత్తేదారులకు బకాయిలు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్లు పనులను పూర్తిగా ఆపేశారు. బకాయిలు, కావాల్సిన నిధులపై నివేదిక ఇచ్చామని జీహెచ్‌ఎంసీ చెబుతోంది.

**మూసీ అభివృద్ధికి అవసరం..**

నగరంలో లక్ష రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాన్ని గత సర్కారు 2017లో చేపట్టింది. ఇప్పటివరకు 69,673 ఇళ్లు పూర్త య్యాయి. మురికివాడల్లోని గుడిసెలను తొలగించి ఆ స్థలంలో 4,590 ఇళ్లు నిర్మించారు. వాటన్నింటినీ గత సర్కారు లాటరీ పద్ధతిలో గతేడాది లబ్ధిదారులకు అందించింది. మిగిలిన 30,327 ఇళ్ల నిర్మాణాన్ని మాత్రం విస్మరించారు. ప్రస్తుతం మూసీ నది అభివృద్ధి పనులు పట్టాలెక్కాయి. నది లోపల ఉన్న 15వేల ఇళ్లను తొలగించాల్సి ఉంటుంది. ఆయా నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్లను ఇవ్వాలన్నది ప్రభుత్వం ఆలోచన. కానీ.. ఇళ్లు మాత్రం సిద్ధంగా లేవు. అవసరమైన రూ.2,600కోట్లను సర్కారు విడుదల చేస్తేనే పనులు తిరిగి మొదలవుతాయి.

**వసతులు లేకుండా.. అప్పగించారు..**

ఇళ్లకు తాగునీరు, విద్యుత్తు సరఫరా పూర్తయిందా? లేదా? అనే విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించారు. మురుగునీటి కనెక్షన్లు, తాగునీటి సరఫరా పనులు ఇటీవల కొలిక్కి వచ్చినట్టు సమాచారం. 12 ప్రాంతాల్లోని 9,196 ఇళ్లలోనే లబ్ధిదారులు చేరారు. మరో ఆరు ప్రాంతాల్లోని 26,156 ఇళ్లలో ఇటీవల మౌలిక సౌకర్యాల కల్పన పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. 24 ప్రాంతాల్లోని 28,319 ఇళ్లు చీకట్లో మగ్గుతున్నాయి.

# పేదల కల నెరవేరేనా?

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలో నిరుపేదలకు సొంతింటి కల నెరవేరేటట్లు కనిపించడం లేదు. ఇళ్లు లేని వారికి రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని భావించి గత ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టింది. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడం, ప్రభుత్వం కేటాయించిన నిధులు చాలకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. దీంతో నిర్మాణాలు నిలిచిపోవడంతో నిరుపేదలు తీవ్ర నిరాశకు గురయ్యారు.వేములవాడ పట్టణానికి ఇతర ప్రాంతాల నుంచి అనేక మంది నిరుపేదలు వలస వస్తుంటారు. ఇందులో చాలా మంది ఇళ్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటూ వివిధ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కొందరు గుడిసెల్లో కాలం వెల్లదీస్తున్నారు. వేములవాడ పట్టణంలో సొంతిళ్లు లేని కుటుంబాలు దాదాపు నాలుగు వేలు ఉన్నట్లు అంచనా. మొదటి విడతలో వేములవాడ పట్టణానికి గత ప్రభుత్వం 800 ఇళ్లను మంజూరు చేసింది. వీటి నిర్మాణాలకు ఒకే ప్రాంతంలో ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో పట్టణ శివారులోని ఆర్టీసీ బస్ డిపో ప్రాంతంలో



చింతల్‌ఠాణా కాలనీ వద్ద ప్రభుత్వ భూమిలో 144 ఇళ్ల నిర్మాణాలకు అయిదేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. మారుపాక రోడ్డులోని ప్రభుత్వ భూమిలో మరో 84 ఇళ్ల నిర్మాణానికి రంగం సిద్ధం చేసినప్పటికీ స్థలం వివాదాస్పదం కావడంలో అక్కడ పనులు మొదలు పెట్టలేదు. కేవలం 144 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టి మధ్యలో వదిలేశారు. జిప్లస్ టులో ఒక్కొక్క బ్లాక్‌లో 12 ఇళ్లు ఉండే విధంగా పనులు మొదలు పెట్టారు. ఈ నిర్మాణాలు మూడేళ్లలో పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఏళ్లుగా మూలుగుతున్నాయి.

అంచనాలు పెరగడంతో...

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు గత ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ. 5.4 లక్షలను కేటాయించింది. ఈ నిధులు సరిపోకపోవడంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. అగ్రిమెంట్ సమయంలో ఉన్న సామగ్రి ధరలు ఆ తరవాత అమాంతం పెరిగిపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా టెండర్లు పిలిస్తే పనులు చేసేందుకు ఎవరు ముందుకు రాలేదు. దీంతో ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మరోవైపు మిగతా ఇళ్ల నిర్మాణాలకు స్థల సమస్య ఏర్పడింది. దీంతో వాటి పనులు మొదలు పెట్టే పరిస్థితి కనిపించడం లేదు. నిర్మాణాలు ప్రారంభించిన 144 ఇళ్లు సైతం పూర్తి చేస్తారన్న నమ్మకం లేకుండా పోయింది. పట్టణంలో చాలా మంది నిరుపేదలు తమకు రెండు పడక గదుల ఇళ్లు వస్తాయన్న ఆశతో గత కొన్నాళ్లుగా ఎదురుచూస్తోన్నారు. ఇప్పటికైనా మధ్యలో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని నిరుపేదలు కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కొత్త ప్రభుత్వంలో ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో గతంలో అనేక సార్లు పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచినప్పటికీ గుత్తేదారులు ముందుకు రాలేదు. వాటిపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తే పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. సతీశ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, వేములవాడ

# వరిపై ఆశలు సన్నగిల్లకుండా..

ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం ఇటీవల పలు పంటలకు మద్దతు ధరను పెంచింది. ప్రధాన పంట వరికి క్వింటాకు రూ.117 పెంచారు. ఈ సీజన్ నుంచి కామన్ రకం (గ్రేడ్ ఏ) ధాన్యం ధర రూ.2,203 నుంచి రూ.2,320కి చేరనుంది. దీనివల్ల ఉమ్మడి జిల్లా రైతులకు కాస్తైనా ఊరట కలగనుంది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ప్రకటించిన రూ.500 బోనస్‌పై రైతులు, ముఖ్యంగా కౌలురైతులు గంపెడాశలు పెట్టుకున్నారు.ఖమ్మం జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో వరి సాగవుతోంది. దీని సాధారణ సాగు విస్తీర్ణం 2,83,943 ఎకరాలు. జిల్లాలో 50 శాతం మంది రైతులు దొడ్డు రకాలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వీరు పంటను విక్రయిస్తూ వస్తున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతతో ఎంతో కొంత ఊరట దక్కినా, ఈ సీజన్ నుంచి సన్నాలు క్వింటాకు రూ.500 బోనస్ వర్తింపజేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనపైనే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చూస్తే.. వానాకాలంలో సగటున 1.60 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. కిన్నెరసాని, తాలిపేరు, మూకమామిడి ప్రాజెక్టులతో పాటు మొర్రేడువాగు, పాములేరు, కిన్నెరసాని, గోదావరి తదితర నదుల పరీవాహకం, చెరువులు, బోరుబావులు ఆధారంగా సాగవుతున్న వాటిల్లో దొడ్డు రకాలు ఎక్కువే. తక్కువ పెట్టుబడి, దిగుబడి ఆశించినంత ఉండటం, ప్రభుత్వం కొనుగోలు చేస్తుండటంతో ఈ రకాల వైపు ఇక్కడి రైతులు మొగ్గుచూపుతున్నారు. చీడపీడలు, మందుల ఖర్చుల కారణంగా సన్నాల సాగుతో ఆశించిన ఫలితం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం ఇంతకు మించి మద్దతు ఇవ్వాలని, సన్నాలు, దొడ్డు అనే తేడాల్లేకుండా అన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బయట మార్కెట్‌లో వ్యాపారులు మద్దతు ధరకు తక్కువగా కొనుగోళ్లు చేపట్టకుండా నియంత్రించాల్సిన అవసరం ఉంది.

పెట్టుబడి మరింత భారం..

దుక్కులు, విత్తనాలు, నాట్లు, కలుపునివారణ, ఎరువులు, పురుగుమందులు, వరికోత యంత్రాలకు ఎకరాకు సగటున రూ.30 వేల నుంచి రూ.35 వేల ఖర్చు వస్తుందన్నది రైతుల లెక్క. సన్నాలైతే 20 నుంచి 24 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. సగటున 22 క్వింటాళ్ల చొప్పున వేసుకుంటే పెరిగిన మద్దతు ధర ప్రకారం ఎకరా మొత్తం రూ.50 వేల ఆదాయం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు, కరవు పరిస్థితులు, చీడ పీడల్లేకుండా దిగుబడి ఆశాజనకంగా ఉంటే రైతుకు మిగిలేది (ఎకరాకు) గరిష్ఠంగా రూ.15 వేలే. లేదంటే పైసా రాకున్నా భూతల్లికి రెక్కల కష్టాన్ని ధారబోసినట్లే. ఉమ్మడి జిల్లాలో ఏటా లక్షల ఎకరాలను కౌలు రైతులు సాగుచేస్తున్నారు. వీరు పెట్టుబడికి తోడు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల చొప్పున యజమానికి కౌలు చెల్లిస్తున్నారు. దీంతో అత్యధికులు నష్టాల్నే మూటగట్టుకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే అప్పులపాలవుతున్నారు. మద్దతు ధర, బోనస్‌లను వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని నిర్ణయించాలన్నది రైతులు, రైతు-కూలీ సంఘాల డిమాండ్. లేదంటే సాగు విస్తీర్ణం అంతకంతకూ పడిపోవం ఖాయమని చెబుతున్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
బుధవారం 31 జూలై 2024

# జలాశయాలకు వరద.. తాగునీటికి భరోసా!

హైదరాబాద్ : మహానగరానికి తాగునీటి భరోసా దక్కింది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రధాన జలాశయాల్లోకి వరద చేరుతోంది. కృష్ణా బేసిన్‌లో కురుస్తున్న వానలతో ఆలమట్టి, నారాయణపూర్, జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి ప్రస్తుతం 3 లక్షల క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. ఈ వరద రోజుకు 29.713 టీఎంసీలకు సమానం. దీంతో ఎడమ, కుడి విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ప్రారంభించడంతో దిగువన ఉన్న నాగార్జునసాగర్‌లోకి 52 వేల క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు. శ్రీశైలంలోకి ఇదే వరద ఈ నెలాఖరు వరకు కొనసాగితే జలాశయం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకోనుంది. అక్కడ నుంచి దిగువకు మరింత వరద రానుంది. నాగార్జునసాగర్ పూర్తి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 507 అడుగులకు చేరింది. మరో మూడు అడుగులు పెరిగితే ఎలాంటి అత్యవసర పంపింగ్ లేకుండా గ్రావిటీతో నగరానికి నీటిని తరలించే వెసులుబాటు కలగనుంది. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు అప్రమత్తమయ్యారు. నాగార్జునసాగర్‌లో గత ఏప్రిల్‌లో ఏర్పాటు చేసిన అత్యవసర పంపింగ్ కేంద్రంలోని పరికరాలను తొలగింపు ప్రక్రియ ప్రారంభించారు. రెండు, మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో తొలగించనున్నారు. సాగర్‌లో నీటి మట్టం 510 అడుగులకు చేరితే.. అక్కడ నుంచి గ్రావిటీ ద్వారా పుట్టంగండి పంప్‌హౌస్‌కు నీటిని తరలించవచ్చు. ఇప్పటికే ఎల్లంపల్లి( గోదావరి) ప్రాజెక్టులో అత్యవసర పంపింగ్‌ను ఎత్తివేశారు. కడెం నుంచి



11,500 క్యూసెక్కుల వరద ఎల్లంపల్లిలోకి చేరుతోంది. ఈ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 16.917 టీఎంసీలు వరకు నిల్వ ఉంది. ఇదే వరద కొనసాగితే ఎల్లంపల్లి కూడా పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోనుంది. నగర నీటి అవసరాల్లో కృష్ణా, గోదావరి జలాలే కీలకం. అటు సాగర్ ఇటు ఎల్లంపల్లి రెండు జలాశయాలు పూర్తి మట్టాలకు చేరితే రానున్న రెండేళ్లు నగరానికి నీటిని అందించవచ్చు. మరోవైపు జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లో ఎగువ ప్రాంతంలో సరైన వానలు లేకపోవడంతో ఈ రెండు జలాశయాల్లోకి ఎలాంటి వరద రావడం లేదు. పరిహాక ప్రాంతంలో విచ్చలవిడిగా ఆక్రమణల వల్ల కూడా వరద నీటికి అడ్డుకట్ట పడుతోంది.

# సంపాదనలో భద్రాద్రి భేష్!

కొత్తగూడెం : వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ.. విద్య, వైద్యం, అక్షరాస్యత, వస్తుసేవల రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు రాష్ట్ర రాజధాని చుట్టుపక్కల జిల్లాలతో పోటీపడతాయని రాష్ట్ర సామాజిక, ఆర్థిక నివేదిక-2024 స్పష్టం చేసింది. ఉభయ జిల్లాల్లో స్థూల దేశీయోత్పత్తి, తలసరి ఆదాయం గణనీయంగా పెరిగినా మహిళా విద్య, ఉపాధి కల్పన, నూతన పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాల్లో ఆశించిన ప్రగతి కనిపించ టం లేదు. ఈ నేపథ్యంలో సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడైన అంశాలపై కథనం..2020-21తో పోల్చితే 2022-23లో భద్రాద్రి జిల్లాలో జీడీడీపీరూ. 11,260 కోట్లు పెరిగి రూ.34,215 కోట్లకు చేరింది.ఖమ్మం జిల్లాలో రూ.8,890 కోట్లు పెరిగి రూ.40,802 కోట్లకు జీడీడీపీ చేరుకోవటం గమనార్హం.

ఊతమిస్తే.. మరింత వృద్ధి

జిల్లా స్థూల దేశీయోత్పత్తిలో(జీడీడీపీ) రాష్ట్రంలో వరుసగా ఆరు, ఎనిమిది స్థానాల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం నిలిచాయి. జిల్లాలో ఉత్పత్తి అయిన వస్తుసేవల విలువ ఆధారంగా జీడీడీపీని లెక్కిస్తారు. జీడీడీపీ పెరుగుదలకు ప్రభుత్వం ఊతమిస్తే మెరుగైన స్థానాలను పొందే అవకాశముంది. ముఖ్యంగా పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన ఖనిజ వనరులు, నీరు, స్థల లభ్యతకు భద్రాద్రి జిల్లా అనుకూలం. వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఖమ్మం నిలయంగా ఉంది.

తలసరి ఆదాయం

తలసరి ఆదాయంలో రాష్ట్రస్థాయిలో భద్రాద్రి జిల్లా రూ.2,64,408తో ఎనిమిదో స్థానంలో, ఖమ్మం జిల్లా రూ.2,44,647తో పదో స్థానంలో నిలిచాయి. ఏజెన్సీ ప్రాంతం, అధికంగా మారుమూల గ్రామాలున్నప్పటికీ.. సింగరేణి, కేటీపీఎస్, బీటీపీఎస్, ఐటీసీ వంటి పరిశ్రమల వల్ల వ్యవసాయాధారిత ఖమ్మం జిల్లాతో పోల్చితే భద్రాద్రి జిల్లా వాసుల తలసరి ఆదాయం ఎక్కువ.

ఆడపిల్లలను ఆదిలోనే చిదిమేస్తున్నారు..

ఖమ్మం జిల్లాలో ప్రతి 1,000 మంది మగ శిశువులకు కేవలం 946 మంది, భద్రాద్రి జిల్లాలో 964 మంది ఆడశిశువుల జననాలు మాత్రమే నమోదవుతున్నాయి. మగవారికి అధిక ప్రాధాన్యమివ్వటం, భ్రూణహత్యలు, చట్టవిరుద్ధ లింగ నిర్ధారణ పరీక్షలతో ఈ అంతరం పెరుగుతోంది.

అర్ధాంతరంగా చదువు మానేస్తుండటంతో..

విద్యాప్రమాణాలను పెంచటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఉభయ జిల్లాల్లో చదువు మధ్యలోనే మానేసే విద్యార్థుల సంఖ్య కలవరపరుస్తోంది.భద్రాద్రి జిల్లాలో ప్రతి 100 మంది విద్యార్థుల్లో తొమ్మిదో తరగతి నుంచి పదోతరగతికి వచ్చే వరకు 16.93 మంది చదువు మానేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 4.22శాతం మంది విద్యకు దూరమవుతున్నారు. ఇందులో అత్యధికంగా బాలికలే ఉంటుండటం స్త్రీ సాధికారతకు గొడ్డలిపెట్టుగా తయారవుతోంది.

కలవరపరుస్తున్న గ్రామీణ అక్షరాస్యత

ఖమ్మం జిల్లాలో ప్రతి వంద మందికి 35, భద్రాద్రి జిల్లాలో 34 మంది నిరక్షరాస్యులుగా ఉండటం గమనార్హం. భద్రాద్రి జిల్లాలో గ్రామీణ అక్షరాస్యత 60.38 శాతమవగా.. ఖమ్మంలో 60.86 శాతం ఉంది. పట్టణ అక్షరాస్యతలో ఖమ్మం జిల్లా 83.35 శాతం, భద్రాద్రి 79.31 శాతం కలిగి ఉన్నాయి. ప్రధానంగా గ్రామీణ మహిళల్లో ప్రతి 100 మందిలో కేవలం 52 మంది మాత్రమే చదువుకుంటున్నారు.

పనిచేయని వారే అధికం..

ఒకచోట నివసించే ప్రజలు వివిధ ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములైనప్పుడే ఆప్రాంతం సత్వరాభివృద్ధి సాధిస్తుంది. భద్రాద్రి జిల్లాలో 48.36 శాతం, ఖమ్మం జిల్లాలో 50.28 శాతం మంది మాత్రమే ఆర్థిక కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారు.

సేవారంగం పరిశ్రమలే ఎక్కువ..ఉభయ జిల్లాల్లో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు)లు 46,178 ఉన్నాయి. వీటిల్లో సేవా ఆధారిత పరిశ్రమలే అధికం.

# మరమ్మతు చేపట్టక.. ప్రమాదాలకు నెలవుగా!



మల్లాపూర్: జిల్లాలో మండల, పట్టణ ప్రాంతాలను కలిపే రహదారులతో పాటు జాతీయ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులకు సకాలంలో మరమ్మతు చేపట్టడం లేదు. కోతలకు గురై, గుంతలమయమైన రహదారులపై రాకపోకలకు వాహనదారులు జంకుతున్నారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు ఏడాది గడుస్తున్నా మరమ్మతు కరవయ్యాయి. కోతలకు గురైన చోట కనీసం హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేయకపో వడంతో రాత్రివేళ గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో నిర్మించిన ఆర్అండ్‌బీ, పంచాయతీ రహదారులకు ఏళ్ల తరబడి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం, మరమ్మతు చేపట్టకపోవడంతో రహదారులు కంకర తేలి అధ్వానంగా మారాయి.

అప్రోచ్ రోడ్డు లేక..

వెల్గటూరు నుంచి జగదేవుపేట వెళ్లే రహదారి ఏళ్ల తరబడి మట్టి రోడ్డుగానే ఉంటోంది. వెల్గటూరు పెద్దవాగుపై వంతెన నిర్మాణం పూర్తయి సుమారు రెండేళ్లు గడుస్తున్నా ఇరువైపులా తారు రోడ్డు నిర్మాణం మాత్రం జరగలేదు. శాఖాపూర్-కొండాపూర్ రోడ్డును ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రూ.2.16 కోట్ల వ్యయంతో 2021 జులైలో జగదేవుపేట వరకు పొడగించి కొత్తగా మంజూరు చేశారు. వెల్గటూరు-కోటిలింగాల మధ్య వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు లేక భక్తులు, యాత్రికులు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొత్తపేట ఎస్సీ కాలనీ మీదుగా పడకల్ వరకు రహదారి, పడకల్ చెరువు కట్ట మీదుగా కొత్తపేట వరకు రహదారులు కోతకు గురైనా మరమ్మతు చేపట్టడం లేదు. చెగ్యాం-శాలపల్లి గ్రామాల మధ్య రహదారి శిథిలావస్థకు చేరుకొంది.

కోతకు గురై ఏడాది..

మెట్‌పల్లి మండలం చింతలపేట గ్రామశివారులోని యూసుఫ్‌నగర్ రహదారిపై గతేడాది వర్షాకాలంలో భారీ వరదలు వచ్చాయి. వరదల వల్ల రహదారి భారీగా కోతకు గురైంది. రోడ్డు ఓవైపునకు పూర్తిగా కొట్టుకుపోగా ఏడాది గడుస్తున్నా మరమ్మతు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. కోతకు గురైన ప్రదేశంలో కనీసం మట్టితో చదును చేయకుండా వదిలేశారు. ఈ రహదారిపై నిత్యం వివిధ గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. దెబ్బతిన్న రోడ్డుపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దగ్గర్లోని కల్వర్టు చిన్నదిగా ఉండటంతో నూతన వంతెన నిర్మాణం చేపడుతున్నారు.

కంకరతేలి.. గుంతలు పడి


మండలంలోని ఒబులాపూర్, కొత్తదాంరాజుపల్లి, గొర్రెపల్లి వద్ద 62వ జాతీయ రహదారి భారీ వర్షాలకు ఇరువైపులా కోతలకు గురికాగా మరమ్మతు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండల కేంద్రం నుంచి మొగిలిపేట, రత్నాపూర్, గుండంపల్లి మార్గాల్లో వేసిన పంచాయతీరాజ్ రహదారులు కంకర తేలి, గుంతలుపడి అధ్వానంగా మారాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లోని లింక్‌రోడ్లను బీటీ రహదారులుగా మార్చేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయడం లేదు. పట్టణ, మండల కేంద్రానికి ప్రభుత్వ కార్యాలయాలతో పాటు బ్యాంకులు, ఇతర అవసరాల కోసం వచ్చేందుకు ప్రజలు, రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.

వాహనదారుల ఇక్కట్లు

మండలంలోని పలుగ్రామాల మధ్య ప్రధాన రహదారులపై గుంతలు పడడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. మండలకేంద్రంలో ఇందిరా గాంధీ చౌరస్తా నుంచి ఒడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాల వరకు రెండు వరుసల రహదారిపై చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. గోధూరు గ్రామం నుంచి మూలరాంపూర్ గ్రామం వరకు గల రెండు వరుసల రహదారిపై, యామాపూర్, ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య ఒక్క వరుస రహదారిపై, ఇబ్రహీంపట్నం నుంచి మెట్‌పల్లికి అమ్మక్కపేట మీదుగా వెళ్లే రెండు వరుసల ప్రధాన రహదారిపై పలు చోట్ల గుంతలున్నాయి. మరమ్మతు చేపట్టక పోవడంతో ఇబ్బందులు పడుతూ ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నరకప్రాయంగా..మల్యాల అడ్డరోడ్డు సమీపంలో జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి పక్కన ప్రమాదకరమైన సైడ్‌బర్మ్‌లను మట్టితో చదును చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మల్యాల నుంచి మల్యాల అడ్డరోడ్డుకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిపై పలు చోట్ల లోతైన గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. రామన్నపేట నుంచి రాంపూర్, గొర్రెగుండం పోతారం, మద్దుట్ల తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు కూడా చెడిపోయాయి. రామన్నపేట నుంచి నూకపల్లి ఆదర్శ పాఠశాల మీదుగా జాతీయ రహదారి వరకు తారురోడ్డు గుంతలు పడి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ముత్యంపేట నుంచి కొండగట్టుకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది.

# ఏ క్షణమైనా కూలొచ్చు!



భువనగిరి : వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పాత ఇళ్లకు ముప్పు ఏర్పడింది. అవి కూలిపోయే ప్రమాదం ఉంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పాత ఇళ్లు వందల సంఖ్యలో ఉన్నాయి. రోజు కురుస్తున్న వర్షాలతో అవి నాని ఎప్పుడైనా కూలే ప్రమాదం ఉంది. అలాంటి వాటిలో కొన్ని ఇళ్లలో నిరుపేదలు నివసిస్తుండగా మరి కొందరు ఖాళీ చేసి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామాల్లో అద్దె ఇళ్లు అందుబాటులో ఉండకపోవడంతో వాటిల్లోనూ బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తు న్నామన్నారు. గతంలో నిర్వహించిన పల్లె ప్రగతిలోనే ఇలాంటి ఇళ్లను గుర్తించారు. యజమానులకు నోటీసులు ఇచ్చి కూల్చివేశారు. నోటీసులు అందుకోని, తాళాలు వేసిన వాటిని వదిలేశారు.గుండాల మండలంలో 36, తుర్కపల్లి 35, నారాయణపురం 28, బొమ్మలరామారం 20 వరకు ఇళ్లు ఉన్నాయి. వీటిలో పాత కాలంలో కట్టినవే ఎక్కువగా ఉన్నాయి. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో ఆబాది, హన్మాన్‌వాడ, సంజీవనగర్‌లో శిథిలభవనాలు సంఖ్య అధికంగానే ఉంది. గతంలో పట్టణంలో పాత ఇళ్లు కూలీ ఒకరిద్దరు మృత్యువాత పడ్డ ఘటనలు ఉన్నాయి.

**తాజా సర్వేలో..**


ప్రభుత్వ ఆదేశాలతో ఇటీవల మళ్లీ సర్వే నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పంచాయతీ కార్యదర్శులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 421 పంచాయతీల్లో 225 వరకు శిథిలమైన ఇళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అనధికారికంగా ఈ సంఖ్య రెండింతలకు పైగా ఉంటుందని అంచనా. జిల్లాలోని భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లో కూడా సుమారుగా 200 పైగా పాడుబడిన ఇళ్లు ఉన్నట్లు అధికారుల లెక్క. మారుమూల మండలాల్లోనే వీటి సంఖ్య ఎక్కువగా ఉంది.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్ ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశం నిర్వహించి పాత ఇళ్ల కూల్చివేతపై ఆదేశాలు జారీ చేశారు. గుండాల మండలంలో గంగపుత్రులు వలస వెళ్లారు. వారి ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. స్థానికంగా లేకపోవడంతో నోటీసులు జారీ చేయలేకపోయారు.

నోటీసులు ఇచ్చాం: సునంద, డీపీవో, యాదాద్రి భువనగిరి

పాత ఇళ్లను పంచాయతీ కార్యదర్శులు గుర్తించారు. 225 వరకు శిథిలమైనవి ఉన్నట్లు గుర్తించాం. వాటిని కూల్చివేయాలని యజమానులకు తాఖీదులు జారీ చేశాం. వెంటనే ఖాళీ చేయాలని చెప్పాం.

# వీధి వ్యాపారులకు గుర్తింపు




సూర్యాపేట : పురపాలికల్లోని వీధి వ్యాపారులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వారి వ్యాపార నిర్వహణకు ఇప్పటికే రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకుంటున్న ప్రభుత్వం ఇప్పుడు వీధి వ్యాపారానికి గుర్తింపునిచ్చే ప్రయత్నం చేస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో 37,784 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. నాలుగేళ్లుగా ప్రధాన మంత్రి స్వనిధి యోజన కింద ఎంపిక చేసిన వీధి వ్యాపారులకు ఉపాధి కల్పించేందుకు మొదటి విడత కింద రూ.10 వేలు, రెండో విడత రూ.20 వేలు, మూడో విడత కింద రూ.50 వేలు రుణం ఇస్తోంది. వీటిని సకాలంలో చెల్లించే వారికి సంక్షేమ పథకాలల్లో ప్రాధాన్యం కల్పిస్తోంది. తాజాగా ఆయా వ్యాపారులు చేసే పనికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**రక్షణగా కార్డులు** సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని పురపాలికల్లో పీఎం స్వనిధి కింద వీధి వ్యాపారులు రుణాలు తీసుకొని లబ్ధి పొందుతుండగా వీరికి రక్షణగా ఉండేందుకు వీలుగా ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేయించారు. వీరికి ఇప్పటికే గుర్తింపు కార్డులు జారీ చేశారు. పుర వీధుల్లో, మార్కెట్లో పని చేసే చోట సైన్‌బోర్డులు ఉండేలా చర్యలు చేపట్టారు. దీనిపై చిరు వ్యాపారుల ఫొటో, వ్యాపార నిర్వహణకు అనుమతించే ధ్రువపత్రం సంఖ్య, చిరునామా, ఏ వ్యాపారం చేస్తున్నారో వివరాలు రాయించారు. నెల కిందట ఇవి పురపాలికలకు చేరాయి. త్వరలోనే పంపిణీ చేసేందుకు రాష్ట్ర మెప్మా శాఖ అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. వారి నుంచి అనుమతి రాగానే వెంటనే పంపిణీకి చర్యలు తీసుకుంటామని మెప్మా జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.

# వసూలు చేసుకో.. జేబులో వేసుకో

హైదరాబాద్: వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న విద్యుత్తు బిల్లులను సిబ్బందే పక్కదారి పట్టిస్తున్నారు. నెలల తరబడి సొంతానికి వినియోగించుకుంటున్నారు. తాము బిల్లులు చెల్లించినా.. కట్టలేదంటున్నారని వినియోగదారులు ఫిర్యాదు చేస్తే అప్పుడు వీళ్ల బాగోతాలు బయటపడుతున్నాయి. బిల్లుల లెక్కలను నెలనెలా పరిశీలించాల్సిన టీజీఎస్పీడీసీఎల్ అకౌంట్స్ విభాగాల అధికారుల పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోనే పలు అక్రమాలు బయటపడ్డాయి.

**నాలుగు నెలలైనా ఏం చేశారు?**

షాద్‌నగర్ డివిజన్ పరిధిలో రూరల్ సెక్షన్‌కు చెందిన గ్రేడ్-2 ఆర్టిజన్ ఒకరు ఫిబ్రవరి 19 నుంచి జులై 18 వరకు 278 బిల్లులకు సంబంధించి రూ.3.63 లక్షలు వసూలు చేసి డిస్కం ఖజానాలో జమ చేయలేదు. ఓ వినియోగదారుడు బిల్లు చెల్లించినా బకాయి చూపడంతో ఫిర్యాదు చేశారు. అప్పుడు కూపీ లాగితే ఆర్టిజన్ నాలుగు నెలలుగా చేస్తున్న బాగోతం బయటపడింది. నాలుగు నెలలుగా పెద్ద మొత్తం సొమ్ము



సొంతానికి వాడుకుంటుంటే సంబంధిత ఏఏవో, జేఏవో క్యాష్ ఏ చేస్తున్నట్లు అనే ప్రశ్నలు వస్తున్నాయి. పక్షం రోజుల కిందనే ఈ బాగోతం సదరు అధికారుల దృష్టికి వచ్చినా.. సొమ్ములు కట్టేదాక ఆగి తర్వాత పైఅధికారులకు ఫిర్యాదు చేశారు.

**చెక్ బౌన్స్‌తో వెలుగులోకి..** కందుకూరులో ఏఏవో వినియోగదారులు చెల్లించే డబ్బులు నెలాఖరు వరకు సొంతానికి వినియోగించుకునేవారు. బయట అధిక వడ్డీలకు అప్పు ఇచ్చేవారు. నెలాఖరులో డిస్కం ఖాతాలో జమ చేసేవారు. ఈ బాగోతం చెక్‌బౌన్స్‌తో బయటపడింది. ఈ వ్యవహారంలో కుమ్మక్కైన జేఏవో క్యాష్, సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. పదవీ విరమణ చేసిన ఓ ఉద్యోగికి సంవత్సరాల తరబడి డబుల్ పింఛన్ ఇచ్చారు. ఈ వ్యవహారంలోనూ బాధ్యుల్ని అప్పట్లో సస్పెండ్ చేశారు. తాజా వ్యవహారంతో రాజేంద్రనగర్ సర్కిల్‌తో సహా డిస్కంలోని మిగతా సర్కిళ్లలోని అకౌంట్స్ విభాగాలపై యాజమాన్యం నజర్ పెట్టింది.

# కారుణ్యంలో దళారీ దందా..

ఇల్లెందు : అనిశా, విజిలెన్స్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచినా సింగరేణిలో కారుణ్య నియామకాల పేరుతో దళారులు సాగిస్తున్న దందాకు అడ్డుకట్ట పడటం లేదు. కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. మెడికల్‌లో అన్నీ తామై చూసుకుంటామని మాయమాటలు చెబుతూ అందినంతా దోచుకుంటున్నారు. తీరా మోసపోయాక, రూ.లక్షలు దండుకున్న అక్రమార్కుల చుట్టూ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో కొన్ని రాజకీయ, యూనియన్ల అండదండలుంటున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇల్లెందు పట్టణంలోని ఓ ప్రధాన పార్టీ నాయకుడు మూడో వార్డుకు చెందిన కార్మికుడి వారసుడికి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.8 లక్షలతో ఒప్పందం చేసుకుని రూ.4 లక్షలు తీసుకున్నాడు. ఏడాది గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో డబ్బు తిరిగివ్వాలని బాధితుడు అడిగాడు. నానాతిప్పలుపడితే రూ.1.50 లక్షలు ఇచ్చాడు. రూ.2.50 లక్షలు ఇవ్వకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. సింగరేణి ఉద్యోగిగా ఉంటూ దళారీ అవతారం ఎత్తిన ఓ ప్రముఖ యూనియన్ నాయకుడు కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఆయన ప్రమేయం లేకున్నా అర్హులకు కారుణ్య కొలువులు రావటంతో ఆశావహులు పెద్దఎత్తున సమర్పించుకున్నారు. తీరా




కొంతమంది కార్మికుల వారసులకు ఉద్యోగం రాకపోవడంతో ఇంటిచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

సింగరేణి సూపర్‌బజార్‌లో పనిచేసే ఉద్యోగి, ఓ పార్టీ నాయకునితో కలిసి ఉద్యోగం ఇప్పిస్తామని రూ.5 లక్షలు తీసుకుని ఆరు నెలలు గడిచాయి. బాధితుడు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

నియామక విధానం ఇలా..

ప్రస్తుతం విధులు నిర్వహించే కార్మికులకు అనారోగ్య సమస్య తలెత్తితే రెండేళ్ల సర్వీసు ఉండగానే కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. మెడికల్ బోర్డులోని వైద్యుల బృందం అతణ్ని పరీక్షించి ఉద్యోగానికి ఫిట్ లేదా అన్‌ఫిట్ అని ప్రకటించాలి. అనారోగ్యంతో ఉద్యోగం చేయలేని పరిస్థితి ఉంటే అన్‌ఫిట్ కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. ఈ క్రమంలో శాఖాపరమైన విచారణలు చేపడతారు.

దళారుల చేతిలో దరఖాస్తుదారుల చిట్టా

కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్న వారి జాబితా కొంతమంది ఉద్యోగుల ద్వారా దళారుల వద్దకు చేరుతోంది. దాన్ని ఆధారంగా వల విసురుతున్నారు. మధ్యవర్తుల అవతారమెత్తుతున్న వారిలో ఎక్కువగా సంస్థ ఉద్యోగులు, పలు యూనియన్ల నాయకులుం డటం, వారి రాజకీయ పలుకుబడి దృష్ట్యా కార్మికులు సులువుగా నమ్మేస్తున్నారు. మెడికల్ బోర్డులో ఇబ్బంది లేకుండా చూసి, వారసునికి ఉద్యోగం ఇప్పించేందుకు రూ.6-7లక్షల వరకు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. మొదటి విడత రూ.2-3 లక్షలు, ఉద్యోగం వచ్చాక మిగిలిన నగదు చెల్లించేలా డీల్ కుదర్చుకుం టున్నారు. దళారులను ఆశ్రయిస్తున్న వారిలో అర్హులతోపాటు, అనర్హు లు ఉంటున్నారు. అర్హులకు ప్రక్రియ ప్రకారం ఉద్యోగం వస్తే దళారీకి పంట పండినట్లే. అనర్హుడికి రాకపోతే డబ్బులు ఇవ్వకుండా ఎగ్గొడుతు న్నారు. కాలయాపన చేస్తూ కొంత ముట్టజెబుతున్నారు. ఇల్లెందుతో పాటు కొత్తగూడెం, మణుగూరు ఏరియా కార్మిక కుటుంబా లు పెద్ద ఎత్తున ఇలా మోసపోతున్నారు.'సింగరేణి సంస్థ నిబంధనల మేరకు కారుణ్య నియామకాల ప్రక్రియ కొనసాగిస్తాం. అర్హులైన కార్మికుల వారసులకు ఉద్యోగం వస్తుంది. దళారులను నమ్మి మోసపోవ ద్దు. ప్రలోభాలకు గురిచేసే వారి వివరాలు తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుం టాం.' జీవీ మోహన్‌రావు, డీజీఎం పర్సనల్



# తిరిగి భారాసలో చేరిన గద్వాల ఎమ్మెల్యే

హైదరాబాద్: గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి భారాసలో చేరారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గద్వాల స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవల ఆయన భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరారు. తాజా ఘటనతో భారాస శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది.




## గద్దర్ అవార్డ్ ప్రతిపాదన పెట్టాం.. అయినా పట్టించుకోలేదు

తెలుగు చలనచిత్ర పరిశ్రమ టాలీవుడ్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గద్దర్ అవార్డులపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి స్పందన లేకపోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మక నంది అవార్డులను గద్దర్ అవార్డులతో భర్తీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ కొత్త కార్యక్రమాన్ని ఎలా సమర్థవంతంగా అమలు చేయాలనే దానిపై అభిప్రాయాన్ని, సూచనలను అందించాలని తెలుగు చిత్ర పరిశ్రమను సీఎం రేవంతరెడ్డి కోరారు. అయితే ఈ విషయంపై సినీ పరిశ్రమ మౌనంగా ఉందని ఆయన అన్నారు. ప్రముఖ తమిళ రచయిత, ఉద్యమకారుడు శివశంకరికి 'విశ్వంభర డాక్టర్ సి. నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం' ప్రదానం సందర్భంగా రేవంత రెడ్డి కామెంట్స్ చేశారు. "తెలుగు చిత్ర పరిశ్రమలో చేసిన కృషికి, విజయాలకు గౌరవంగా గద్దర్ అవార్డులను ప్రకటించాం. దీనిపై కార్యచరణ సిద్ధం చేయమని పరిశ్రమను కోరాం. సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేకపోవటం బాధాకరం" అని ముఖమంత్రి అన్నారు.



## తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టేదే బోనాల పండుగ

బీర్కూర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే సంబరాలే బోనాల పండగ అని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం పేర్కొన్నారు. బీర్కూర్‌లో నిర్వహించిన బోనాల పండగ సంబరాలకు మంగళవారం వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరిద్దరు బోనం ఎత్తారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శంకర్, తాషీరామ్, శశికాంత్, గంగారం, చందు, అవారి గంగారం, తదితరులు పాల్గొన్నారు.

## కదులుతున్న బస్సులో మహిళపై అత్యాచారం.. పరారీలో డ్రైవర్




హైదరాబాద్: కదులుతున్న బస్సులో మహిళపై అత్యాచారం ఘటన సంచలనం రేపింది. తెలంగాణలోని నిర్మల్ నుంచి ఏపీలోని ప్రకాశం జిల్లాకు వెళ్తున్న బస్సులో మహిళపై అఘాయిత్యం జరిగింది. నోట్లో గుడ్డలు కుక్కి డ్రైవర్ తనపై అత్యాచారం చేశాడని డయల్ 100 ద్వారా బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఓయూ పీఎస్ సమీపంలో బస్సును ఆపి సీజ్ చేశారు. బస్సులో ఇద్దరు డ్రైవర్లు ఉండగా ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో డ్రైవర్ (ప్రధాన నిందితుడి) కోసం గాలిస్తున్నట్లు సీఐ రాజేందర్ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194





కేరళలోని వయనాడ్‌లో మృతుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఇప్పటివరకు 93 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో మెప్పాడి ఆస్పత్రిలోనే 18 మరణాలు నమోదయ్యాయి. మరోవైపు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పర్యటక ప్రాంతమైన మెప్పాడులో పరిస్థితి ఘోరంగా ఉంది. ఇక్కడి ముండక్కై ప్రాంతంలో భారీ సంఖ్యలో ప్రాణనష్టం జరిగింది. చలియార్ నది సమీపంలో దాదాపు 10 మృతదేహాలను స్వాధీనం చేసుకొన్నారు. ఇక చురల్మల వద్దనున్న ఏకైక వంతెన, ప్రధాన రహదారి ధ్వంసమయ్యాయి. దీంతో 250మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ముండక్కై ఆవలవైపు సహాయక చర్యలు చేపడుతున్నారు. సైన్యం ఇక్కడ తాత్కాలిక వంతెనను నిర్మిస్తే ఆ ప్రాంతానికి చేరుకొని చర్యలు చేపట్టనున్నారు. అసలు ఆ గ్రామంలో పరిస్థితి ఏమిటనేది ఇప్పటివరకు పూర్తి సమాచారం తెలియడం లేదు. అక్కడ కేవలం హెలికాప్టర్లతోనే స్వల్ప సాయం చేయగలిగే అవకాశం ఉంది. ఇప్పటికే వాయుసేనకు చెందిన రెండు హెలికాప్టర్లు సులురు నుంచి వయనాడ్‌కు చేరుకొన్నాయి. భారీ వర్షాలు కొనసాగుతుండటంతో హెలికాప్టర్లు కూడా పరిమిత స్థాయిలో సేవలు అందించే పరిస్థితి నెలకొంది. ఈ హెలికాప్టర్లు కొండచరియలు పడిన ప్రాంతంలో ల్యాండ్ అయ్యే పరిస్థితి లేకపోవడం సమస్యాత్మకంగా మారడంతో అవి కోజికోడ్‌కు తిరిగివెళ్లాయి. పనమరం, కరమాంతొడే, కబానీ నదుల నుంచి నీటి ప్రవాహం పెరగడంతో బాణుసురసాగర్ డ్యామ్ గేట్లు ఎత్తేశారు.

**మెప్పాడి రిసార్టులో 150 మంది..** మెప్పాడి సమీపంలోని ట్రీ వ్యాలీ రిసార్ట్ లో 150 మంది చిక్కుకుపోయారు. రాత్రివేళ వర్షం పడుతుండటంతో కొందరు స్థానికులు కూడా అక్కడ తలదాచుకొన్నారు. ప్రస్తుతానికి అందరూ సురక్షితంగానే ఉన్నారు. ఆ ప్రాంతంలో మొత్తం కొండచరియలు విరిగిపడినట్లు రిసార్ట్ వర్గాలు వెల్లడించాయి. దీంతో దాదాపు 40 ఇళ్లు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు.

**ఐదు జిల్లాల్లో రెడ్ అలర్ట్ :** కేరళలోని ఐదు జిల్లాల్లో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. వీటిల్లో మల్లప్పురం, కోజీకోడ్, వయనాడ్, కసరగొడ్, కన్నూరు ఉన్నాయి. రానున్న 24 గంటల్లో ఇక్కడ అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇక ఎర్నాకులం, ఇడుక్కీ, త్రిశూర్, పాల్కడ్ జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది.

**రంగంలోకి సైన్యం స్పెషలిస్టు బృందాలు :** వయనాడ్‌లో సహాయక చర్యలు చేపట్టేందుకు కన్నూర్‌లోని డిఫెన్స్ సెక్యూరిటీ కోర్ నుంచి రెండు వరద సహాయక కాలమ్స్‌ను వయనాడ్‌కు తరలించారు. బెంగళూరు నుంచి ఆర్మీ ఇంజినీర్ కోర్ బృందం బయల్దేరింది. అది త్వరలోనే వయనాడ్ చేరుకోనుంది. కొండచరియల తొలగింపు, తాత్కాలిక నిర్మాణాల్లో వీరికి నైపుణ్యం ఉంది. మరోవైపు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఆర్మీచీఫ్ ఉపేంద్ర ద్వివేదితో కేరళలోని పరిస్థితిపై చర్చించారు. ఇప్పటికే 122 ఇన్‌ఫాంట్రీ బెటాలియన్‌కు చెందిన రెండు కాలమ్స్ వెళ్లినట్లు ఆర్మీ చీఫ్ పేర్కొన్నారు. మొత్తం 225 మంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు.




హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ కమిషన్ కొత్త ఛైర్మన్‌గా జస్టిస్ మదన్ భీమ్ రావు లోకూర్‌ని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నాడు నియమించింది. లోకూర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పలు కీలక కేసుల్లో తీర్పును వెలువరించారు. 1953, డిసెంబర్ 31న జన్మించారు. 1977, జూలై 28న న్యాయవాద వృత్తిని ఆయన ప్రారంభించారు. 2010%-%12 మధ్యకాలంలో గువాహటి, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నిధులు నిర్వర్తించారు. 2012 జూన్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా లోకూర్‌ను నియమించారు. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)తో కలిసి 47 కేసుల్లో కీలక తీర్పులు ఇచ్చారు. అప్పటి సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా వ్యవహారశైలికి వ్యతిరేకంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసిన నలుగురు జడ్జీల్లో జస్టిస్ లోకూర్ ఒకరు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ కొనుగోలు, ప్లాంట్ల నిర్మాణంలో జరిగిన అవకతవకలను బయటపెట్టేందుకు రేవంత్ సర్కార్ వేగంగా చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా విద్యుత్ కమిషన్‌కు కొత్త ఛైర్మన్‌ను నియమించింది. కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలు, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ల అవకతవకలపై జ్యుడీషియల్ విచారణను ప్రభుత్వం వేగవంతం చేసింది. అయితే, లోకూర్ మళ్లీ మొదటి నుంచి మొదటి నుంచి పలు కీలక అంశాలపై విచారణ జరిపే అవకాశం ఉంది. ఏ ఏ అంశాలపై జస్టిస్ నరసింహారెడ్డి విచారణ జరిపారో ఆయా అంశాలపై విచారణనె లోకూర్ కొనసాగించనున్నారు.

**యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో రూ.15 వేల కోట్ల దోపిడీ..** మరోవైపు, నిన్న అసెంబ్లీలో విద్యుత్ అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం తారా స్థాయికి చేరింది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో రూ.15 వేల కోట్ల దోపిడీ జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టులోనూ మెగావాట్‌కు రూ.రెండున్నర కోట్ల చొప్పున అంచనా పెంచి.. మొత్తంగా రూ.రెండున్నర వేల కోట్లు అక్రమాల లెక్కతేలాలని అన్నారు. దొరికిపోతామని అర్థమైనందునే.. మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లి విచారణ కమిషన్‌ను రద్దు చేయాలంటూ కోరారని ఆరోపించారు. కానీ, విచారణ అనంతరం సుప్రీంకోర్టు కమిషన్‌ను కొనసాగించాల్సిందిగా స్పష్టం చేసిందని తెలిపారు. సోమవారం అసెంబ్లీలో చర్చ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ, "మాజీ మంత్రి ఆవేదన చూస్తుంటే ఇప్పటికే చర్లపల్లి జైల్లో ఉన్నట్లుంది. జ్యుడీషియల్ విచారణ మేము అనలేదు. ఇదే సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కొన్ని అంశాల్ని ప్రస్తావించినప్పుడు మా నిజాయితీని మేం నిరూపించుకుంటాం.. విచారణకు ఆదేశాలివ్వాలని కోరారు.

**వారే కోర్టుకెళ్లారు..** ఛత్తీస్‌గఢ్ నుంచి కొనుగోలు చేసిన వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఒప్పందం, యాదాద్రి 260 ఇన్‌టూ 4, సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో 1040 మెగావాట్ల భద్రాద్రి పవర్ ప్రాజెక్టు నిర్మాణం, యాదాద్రి 4వేల విద్యుత్ ఒప్పందం బీహెచ్ఈఎల్‌కు ఇవ్వడంపై వారు అడిగితేనే ఆమోదించాం. కమిషన్ సమన్లు ఇచ్చినప్పుడు తమ వాదనలు వినిపిస్తే వాళ్ల నిజాయితీ బయటకు వచ్చేది. అక్కడికి వెళ్లకుండా ఆ కమిషనే వద్దు అని కోర్టుకు వెళ్లారు. హైకోర్టు వారి వాదనను తిరస్కరించింది. సుప్రీంకోర్టుకు వెళ్తే విచారణ కొనసాగించాల్సిందేనని స్పష్టం చేసింది. కమిషన్ ఛైర్మన్ పట్ల అభ్యంతరాలు ఉంటే వ్యక్తిని మార్చేందుకు ప్రభుత్వాన్ని సూచించింది. ఈ రోజు సాయంత్రంలోగా కొత్త ఛైర్మన్‌ను నియమిస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.




## 10 అడుగుల గదికి రూ. 12 వేలు.. సివిల్స్ విద్యార్థుల దుస్థితి..!

దిల్లీ: ఐఏఎస్ కావాలని చాలామంది కలలు కంటుంటారు. అందుకోసం కుటుంబాలను విడిచి దేశం నలుమూలల నుంచి లక్షల మంది దేశ రాజధాని దిల్లీకి వచ్చి లక్ష్య చేధన కోసం శ్రమిస్తుంటారు. ఇదే అదునుగా భావించి కొందరు తమ ఇంటి అద్దెను విపరీతంగా పెంచేస్తున్నారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న ఓ విద్యార్థి గదికి సంబంధించిన వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం 10 అడుగుల పొడవు, వెడల్పు కలిగిన గదిలో ఓ విద్యార్థి సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నాడు. ఒక టేబుల్, కొన్ని పుస్తకాలు, ఒక కుర్చీ, నడవడానికి కాస్త స్థలం మాత్రమే ఉంది. లోపల ఒకరు ఉంటే మరొకరు కాసేపు ఉండేందుకు చోటు కూడా లేని పరిస్థితి. దుస్తులను కూడా లోపలే ఆరబెట్టుకోవాల్సిన దుస్థితి. ఈ ఇరుకుగదికి యజమానులు రూ.12 నుంచి రూ.15 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. ఏటా అద్దె పెరుగుతూనే ఉంటుంది. నగరంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇలాంటిచోట ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యార్థులు పరీక్షకు సన్నద్ధం అవుతున్నారు. దీనికి సంబంధించిన వీడియోను డీఎస్పీ అంజలి కటారియా ఖాతాలో షేర్ చేశారు. విద్యార్థుల దుస్థితిపై ఆందోళన వ్యక్తంచేశారు. "10%శ%10 చిన్న గదికి విద్యార్థులు రూ.వేలు చెల్లిస్తున్నారు.

ఇంటి నుంచి దూరంగా ఉండాలని మాత్రమే దిల్లీకి రావొద్దు. మీ కుటుంబం డబ్బును వృథా చేయకండి. ఆన్‌లైన్ వీడియో ద్వారా ప్రిపేర్ అవడానికే విద్యార్థులు ఇంత మొత్తం చెల్లిస్తున్నారు. ఇది ఆలోచించాల్సిన విషయం" అని పోస్టు చేశారు. కాగా.. ఇటీవల దిల్లీలోని కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి వరద నీరు చేరడంతో ముగ్గురు సివిల్స్ విద్యార్థులు మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. సరైన వాతావరణం లేనిచోట తాము ప్రిపేర్ అవుతున్నామంటున్న విద్యార్థులు.. ఆ ముగ్గురి మరణాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో కోచింగ్ సెంటర్ యజమానిని అరెస్టు చేసిన పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660